క్లుప్తంగా

గిరిజనుల సంక్షేమం కోసమే ఆది కర్మయోగి అభియాన్


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యానంద్

ఇచ్చోడ: అత్యంత వెనుకబడిన ఆదిమ గిరిజన జాతుల వారికి సంక్షేమ పథకాలను అందించేందుకు కేంద్రం ప్రభుత్వం ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో సత్యానంద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గేర్జం, దాబా(కె), మల్యాల్, మాన్కపూర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలకు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఆదిమ గిరిజన జాతుల వారికి సంక్షేమ పథకాలు అందించే దిశగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం


ప్రహ్లాద్‌ను సన్మానిస్తున్న ఏపీఎం వెంకట్‌రెడ్డి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా గురువారం మండల వాసులు, రైతులు, మండల మహిళ సమాఖ్య సభ్యులు, ఐకేపీ సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పరచ సాయన్న, తొట్ల శంకర్, చట్ల ఉత్తం, బత్తిని మురళీకృష్ణ, దుబ్బుల చంద్రశేఖర్, నరేశ్, లక్కం శంకర్, కిశోర్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

తలమడుగు: ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలం రుయ్యాడి గ్రామంలో నూతనంగా నిర్మించే శబరిమాత ఆశ్రమానికి భూమిపూజ చేశారు. గత 40 సంవత్సరాల క్రితం కట్టిన ఆశ్రమం శిథిలావస్థలో ఉందని, 10 లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులతో నూతన భవనాన్ని 6నెలల లోపే నిర్మించి భక్తులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాబాన్న, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, గ్రామ పెద్దలు మోతి రాజమల్లు, గోనెల గంగన్న, గోక సంజీవరెడ్డి, గోక దేవారెడ్డి, మోతి శ్రీనివాస్, గోక వెంకట్ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, గాజుల సాంబశివ, నిట్టడి అశోక్ పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం దంతన్‌పల్లికి చెందిన చెందిన బద్దం నగేందర్ రెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా.. అంత్యక్రియలు దంతనపల్లిలో కుటుంబసభ్యులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని ఠాకూర్ హోటల్ సమీపంలో 40 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. నాలుగు రోజులుగా మృతదేహం రిమ్స్‌లోని మార్చురీలో ఉంది. ఆమెకు సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో గురువారం బెస్ట్ ఫ్రెండ్, మానవ సేవే మాధవ సేవ స్వచ్ఛంద సంస్థలు అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: బెస్ట్ ఫ్రెండ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అజీజ్, ముజాహిద్, రఫియా బేగం, మహ్మద్ ఆసిఫ్ అలీ, షౌకత్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఇందిరమ్మ మోడల్ హౌస్‌లో నూతనంగా ప్రారంభమైన ఆధార్ కేంద్రాన్ని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రత్నాకర్‌రావు అన్నారు. గురువారం ఆధార్ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేష్, నాయకులు లక్ష్మీపతి గౌడ్, చరణ్, కుత్బుద్దీన్, హౌసింగ్ ఏఈ ఖయ్యూమ్, తదితరులు ఉన్నారు.

గురుభ్యో నమః

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థిని క్రమశిక్షణలో నడిపించడం, సన్మార్గం వైపు తీసుకెళ్లడం, ఎంచుకున్న గమ్యం చేరుకునేలా ప్రోత్సహించడం ఇవన్నీ గురువు భూమికలో భాగం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే తీరును నేర్పుతూ, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కావాల్సిన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనది. అందుకే గురువులను దైవంతో సమానంగా భావిస్తారు. భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతీ ఏడాది సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


విద్యార్థులతో ఉపాధ్యాయుడు చిలక సతీష్

విద్యార్థుల అభివృద్ధే ధ్యేయం

సాత్నాల: మండలం మెడిగూడ(సి) ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చిలుక సతీష్ విద్యార్థుల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఆడుతూ పాడుతూ బోధిస్తూ, ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులు వెళ్లకుండా అవగాహన కల్పించాడు. స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ స్కిల్ కార్యక్రమాలు చేపట్టారు. 'బడి కోసం నా వంతు' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.

కృత్యాధార బోధనతో..



విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయడం చంద్రకాంత్ బాబుకే సాధ్యం. టీచింగ్ లర్నింగ్ మెటీరియల్‌తో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. పనిచేస్తున్న పాఠశాలలో గోండు, మరాఠీ విద్యార్థులు చదువుకుంటున్నారు. వారి మాతృభాషలో అర్థమయ్యే విధంగా బోధన చేస్తున్నారు.

– చంద్రకాంత్ బాబు, ఎస్జీటీ, బజార్‌హత్నూర్

విద్యార్థులకు చేయూత..



చదువుతోనే భవిష్యత్ ఉంటుందని విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన నోటు బుక్కులు, పెన్నులు, సామగ్రి అందజేస్తున్నారు. సర్కారు బడుల్లో వచ్చేది పేద విద్యార్థులు కావడంతో వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నారు.

– గుమ్మడి రవిందర్ రెడ్డి, ఎస్జీటీ, పిప్పల్‌కోటి

గణితంలో పట్టు సాధించేలా..



డీఎస్సీ 2000 ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన జయసుధ ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వినూత్న రీతిలో డిజిటల్ పాఠాలు బోధిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభంగా గణితం బోధించడంలో ఈమె దిట్ట.

– జయసుధ, ఎస్ఏ, రణదీవెనగర్, ఆదిలాబాద్

ఆటపాటలతో చదువు..



బోథ్ మండలంలోని నిగిని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సంధ్యరాణి పని చేస్తున్నారు. విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యను బోధిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా కృషి చేస్తున్నారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడంలో కీలకంగా ఉన్నారు.

– సంధ్యరాణి, ఎస్జీటీ, నిగిని

వేసవి సెలవుల్లోనూ..



పేద విద్యార్థుల భవిష్యత్ బాటలు వేసేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచితంగా ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. గణితంలో మెళుకువలు నేర్పుతున్నారు. గణితం అనే భయాన్ని పారద్రోలుతున్నారు.

– మార్శెట్టి వికేష్ కుమార్, ఎస్జీటీ, ముక్తాపూర్

వంద శాతం ఉత్తీర్ణత



జిల్లాలోని వివిధ పాఠశాలలో పని చేస్తూ మ్యాథమెటిక్స్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాను. ప్రస్తుతం బోధన చేస్తున్న పాఠశాలలో తోటి ఉపాధ్యాయుల, విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాల ఆవరణలో ఆహ్లాదకర వాతావరణం అందేలా కృషి చేశా.

– సాగల సుదర్శన్, ఎస్ఏ, మ్యాథ్స్, జెడ్పీహెచ్ఎస్, మావల

సులువైన పద్ధతిలో..



విద్యార్థులకు నాణ్యమైన బోధనను అందించడంలో భాగంగా వారికి సులువైనా పద్ధతిలో విద్య బోధన చేశా. ఆట, పాటలతో మ్యాథ్స్ బోధన చేశా. పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు పచ్చదనం పెంచా. ప్రతీరోజు పాఠశాలకు హాజరయ్యేలా తనవంతుగా కృషి చేశా.

– జగదీశ్వర్, ఎస్జీటీ, ఎంపీయూపీఎస్, బట్టిసావర్‌గాం, మావల

గిరిజన గ్రామాల రోడ్లకు మహర్దశ


క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గిరిజనశాఖ జీవో నం.240 ద్వారా నియోజకవర్గంలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.24 కోట్లు మంజూరు చేయించారు. నేరడిగొండ మండలంలోని గొలిగూడ గ్రామానికి రూ.1.10 కోట్లు, బుర్కపల్లికి రూ.57 లక్షలు, సేవాదాస్‌నగర్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.35 కోట్లు, నారాయణపూర్ గ్రామానికి రూ.20 లక్షలు, తాంసి మండలంలోని వడ్డాడి నుంచి తాంసి వరకు రూ.87లక్షలు, తాంసి నుంచి కుచులాపూర్ వరకు రూ.1.20 కోట్లు, పొన్నారి నుంచి కప్పర్ల రూ.1.50 కోట్లు, జామిడి నుంచి సవర్గాం రూ.1.80 కోట్లు, బండల్‌నాగపూర్ నుంచి వడ్డాడికి రూ.2.65 కోట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం..

నేరడిగొండ మండలంలోని బుర్కపల్లి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయించినందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చిత్రపటానికి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా తమను ఎవరూ పట్టించుకోలేదని, ఆనాడు మాటిచ్చి నేడు బీటీ రోడ్డును మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


విద్యార్థులతో డీఐఈవో గణేశ్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో అత్యున్నతమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులను గౌరవించడం విద్యార్థుల సంస్కారమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సరస్వతి, అధ్యాపకులు నర్సయ్య, మధు, అనిత, ప్రభాత్‌కుమార్, సరిత రాణి, దయాకర్, సూభాష్, విజయలక్ష్మి, బాలకృష్ణ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో, ఆదర్శ పాఠశాల, ఏజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రత్యేక దుస్తువులు ధరించి ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. పలువురు గురువులను విద్యార్థులు శాలువా, పూలమాలతో సత్కరించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి


టీచర్లుగా మారిన విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు బాటలు వేయాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ అతీఖ్ బేగం అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రఘు, యాఖుబ్ అలీ, పృథ్విరాజ్, చంద్రకాంత్, అనిత, స్వప్న, కునాల్, గజానంద్, నరేశ్ పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డీఐఈవో గణేష్ జాదవ్ పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా లెక్చరర్లను శాలువాతో సన్మానించారు.

పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చి మొక్కలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు. బుధవారం 'సాక్షి'లో 'గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం' అనే కథనానికి పంచాయతీ కార్యదర్శి మోతిరాం స్పందించారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఆశ్రమ పాఠశాలలో దోమలు మందు పిచికారీ చేయించారు. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీడీవో గంగాసింగ్ తెలిపారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

లోకేశ్వరం: మండలంలోని గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలను ఈనెల 5వ తేదీ నుంచి 11 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5న కిష్టాపూర్‌లో, 6న బిలోలి, పోట్‌పల్లి, మన్మద్, పంచగుడి, జోహర్‌పూర్, వట్టోలి, 7న రాయపూర్‌కాండ్లీ, పిప్రి, గడ్‌చాంద గ్రామాల్లో, 8న రాజూర, 9న నగర్, హవర్గా, పుస్పూర్, భాగాపూర్, 10న హథ్గాం, 11న లోకేశ్వరం, అబ్దుల్లాపూర్, సాథ్గాం, ధర్మోర, గొడిసెరా, కన్కపూర్, బామ్ని(కే), నర్సింహనగర్, సేవాలాల్‌తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సభలకు ఉపాధి కూలీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అనంతరం ఈనెల 12 మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని.. కూలీలు, నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు.

గంగమ్మ చెంతకు గణపయ్య


చింతలసాంగ్వీలో..


గణపతి శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

సాత్నాల: భోరజ్ మండలాలలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించి, చివరి రోజు అట్టహాసంగా నిమజ్జనం చేశారు. మహిళలు జానపద గీతాలు ఆలపిస్తూ గణపయ్యను పల్లకిలో తీసుకెళ్లారు. వెళ్లి రా గణపయ్య.. మళ్లీరా అంటూ భక్తులు వీడ్కోలు పలికారు.

జైనథ్: మండల కేంద్రంలో తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథులు గురువారం నిమజ్జనానికి బయలుదేరారు. నిర్వాహకులు గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. డీజే, డప్పు చప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ.. శోభాయాత్ర సాగింది. అనంతరం సమీపంలో వాగులో గణనాథులను నిమజ్జనం చేశారు.

బజార్‌హత్నూర్: మండలంలోని చింతలసాంగ్వీ, మాడగూడ, బజార్‌హత్నూర్, గిర్నూర్, దేగామ, టెంబి, రాంపూర్ గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. యువకులు డప్పు చప్పుళ్ల మధ్య నృత్యం చేశారు. వినాయక ప్రతిమలను శోభాయాత్రగా తీసుకెళ్లి సమీప వాగులలో నిమజ్జనం చేశారు.


నృత్యం చేస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో, రెడ్డికాలనీలో, కోకస్‌మన్నూర్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు.

బీసీల చిరకాల ఆకాంక్ష నెరవేరింది

నేరడిగొండ: కాంగ్రెస్‌తో బీసీల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లపై ఏకగ్రీవ తీర్మానం చేయడంపై గురువారం వడూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాయిడి రవి, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, పాల శంకర్, ధరందాస్ మహేందర్, కొప్పుల ఊషన్న, గంగారెడ్డి, బోలెశెట్టి రాములు, భోజన్న, పాల వెంకట రమణ పాల్గొన్నారు.

- మండలంలోని వడూర్ గ్రామంలో పెద్ద హనుమాన్ ఆలయం వద్ద గణేష్ లడ్డు వేలంను రూ.25 వేలకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ దక్కించుకున్నారు. వినాయకుడి, వడూర్ గ్రామ ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా నాపై ఉండాలని ఆకాంక్షించారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గజేందర్

శిథిలావస్థలో వంతెన


శిథిలావస్థకు చేరిన నిరాల వంతెన

జైనథ్: మండలంలోని నిరాల గ్రామ సమీపంలోని వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన పైనుంచి రాకపోకలు సాగించాలని అంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షం పడితే గంటలు తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అలాగే తర్లం వంతెన శిథిలావస్థకు చేరడంతో హై లెవెల్ వంతెనను అధికారులు తొలగించారు. ఆ వంతెన స్థానంలో లోలెవెల్ వంతెన నిర్మించారు. చిన్నపాటి వర్షానికే వరద వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆదిలాబాద్ జిల్లాకు పోవాలంటే నిరాల నుంచి వెళ్లాలి. అయితే ఎటునుంచి ఏ ప్రమాదం పొంచి ఉందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హై లెవెల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

గోరింటాకు సందడి

భైంసాటౌన్: పట్టణంలోని గీతానగర్‌లో మహిళలు గురువారం గోరింటాకు ఉత్సవం, గాజుల సవ్వడి కార్యక్రమం జరుపుకొన్నారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా మండపం వద్ద కాలనీ మహిళలు ఒకచోట చేరి సందడి చేశారు. ఒకరికొకరు పసుపు, కుంకుమ పెట్టుకొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చేతులకు గోరింటాకు పెట్టుకొని గాజులు వేసుకొన్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.


చేతులకు గోరింటాకుతో మహిళలు

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

ఖానాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దృష్టి సారించాలని తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్ రావు అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, గోసంపల్లి పంచాయతీ కార్యాలయాల్లో ఆయా గ్రామాల పరిధి కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే వారి ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కడెం: మండలకేంద్రంతోపాటు మండలంలోని లింగాపూర్, నవాబ్‌పేట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల స్థితి, బిల్లులు తదితర అంశాలు చర్చించారు. ఇందులో ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, ఏపీఎం గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు తదితరులున్నారు.

రోడ్డుకు 'వీడీసీ' మరమ్మతులు

లోకేశ్వరం: ఇటీవల భారీవర్షాలకు మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామ సమీపంలో భైంసా రోడ్డు నుంచి పోస్టాఫీసు వరకు రోడ్డు కొట్టుపోయి గుంతలు ఏర్పడాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గురువారం రాయపూర్‌కాండ్లీ వీడీసీ సభ్యులు రూ.45 వేలతో మొరం పోయించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.